క్లుప్తంగా

హోం మంత్రి సమాధానం చెప్పాలి

• బీజేపీ నేత నిరసన



నెల్లూరు(బృందావనం): మదనపల్లిలో హనుమాన్ ర్యాలీని పోలీసులు అడ్డుకుని లాఠీచార్జి చేసిన ఘటనపై హోంశాఖ మంత్రి అనిత సమాధానం చెప్పాలని బీజేపీ నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మూలాపేటలోని పొట్టిశ్రీరాములు విగ్రహం కూడలిలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా పోలీసులు వ్యవహరించారని, దీనిపై ఆమె సంజాయిషీ ఇవ్వాలన్నారు.

నీరు లేక మరుగుదొడ్డికి తాళం



మూతపడిన పబ్లిక్ టాయిలెట్

నెల్లూరు రూరల్: కలెక్టరేట్‌లోని నగరపాలక సంస్థ పబ్లిక్ టాయిలెట్‌కు తాళం పడింది. ట్యాంక్‌లో నీరు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో సోమవారం అర్జీదారులు ఇబ్బంది పడ్డారు. మోటర్ వేసినా ట్యాంక్‌లోకి నీరు వెళ్లడం లేదని, అంతటికీ ఒక ట్యాంక్ మాత్రమే ఉందని, మరొకటి ఏర్పాటు చేస్తే మున్సిపల్ వాటర్ వచ్చినప్పుడు నింపవచ్చని సంబంధిత సిబ్బంది చెబుతున్నారు.

ముగిసిన ఆలిండియా చెస్ పోటీలు



విజేతలతో అతిథులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : స్థానిక గొలగమూడి రోడ్డులోని ఫన్‌పార్కు కన్వెన్షన్ హాల్లో ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. ఇందులో చెన్నైకి చెందిన ఆర్.శ్యామ్ ప్రథమ స్థానంలో నిలువగా, రెండో స్థానంలో గుంటూరు జిల్లాకు చెందిన డి.దవేష్, తృతీయ స్థానంలో విజయవాడకు చెందిన వి.అభిరామ్, తరువాతి స్థానాల్లో తమిళనాడుకు చెందిన ఆకాష్, విజయవాడకు చెందిన శివ పవన్ తేజ నిలిచారు. ఫన్ పార్కు మేనేజింగ్ డైరెక్టర్ సాయి పొత్తూరి విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌రాజు మృతికి సంతాపం

నెల్లూరు(బృందావనం) : అన్నమాచార్య ఆరాధన సమితి అధ్యక్షుడు కేవీ సుధాకర్‌రాజు (70) హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం మరణించారు. కళారంగానికి, కళాకారులకు తన వంతు సహాయ సహకారాలందించిన సుధాకర్‌రాజు మృతికి కళాకారుడు జిల్లాకు చెందిన దోర్నాల హరిబాబు, 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి సంతాపం తెలిపారు.

ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుంటాం

• మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు సిటీ : ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవాలన్న ఆలోచనను మానుకోవాలని, ఇప్పటికే ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు ఉంటే వాటిని వెనక్కు స్వాధీనం చేసుకుంటామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నారాయణ మెడికల్ కళాశాలలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం అధికారులు, కాంట్రాక్టర్లు, టీడీపీ నేతలు, కో-ఆర్డినేటర్లతో సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఎక్కడా అభివృద్ధి పనులు ఆగకుండా ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, టీడీపీ నేతలు మామిడాల మధు, అనూరాధ, విజేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో మినీ మహానాడు

నెల్లూరు సిటీ : మాగుంట లేఅవుట్‌లోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం నిర్వహించారు. రూరల్‌లో అభివృద్ధి పనులపై 12 అంశాలను టీడీపీ నేతలు ప్రతిపాదించగా అమలు చేస్తానని శ్రీధర్‌రెడ్డి హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అస్తవ్యస్తం

• భూగర్భ డ్రెయినేజీ పనులతో గుల్లగుల్లగా మారిన అంతర్గత రోడ్లు
• ఒక్కరోజు వర్షానికే కుంగిన వైనం
• తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అధికారుల నడుమ సమన్వయలోపం స్థానికుల పాలిట శాపంగా మారింది. అభివృద్ధి పనుల్లో భాగంగా అంతర్గత రహదారులు తవ్వి పనులు పూర్తయిన తరువాత పట్టించుకోకపోవడంతో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో రాకపోకలకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు.

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలో భూగర్భ డ్రెయినేజీ పనులు ఎప్పటికి పూర్తయ్యేనో అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ పనులు నేటికీ పూర్తికాకపోవడం.. మరో వైపు ఇంకా మిగిలి ఉన్న ప్రాంతాల్లో భూగర్భ డ్రెయినేజీ పనులు చేపట్టడంతో ఆయా ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. భూగర్భ డ్రెయినేజీ పనులు పూర్తయితే నగర ప్రజలందరికీ మేలు. అయితే ఈ పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రజలకు సంకటంగా మారింది.

కుంగిన అంతర్గత రోడ్డు

నగరంలోని నాలుగో డివిజన్ పరిధిలో మారుతీనగర్‌లో ఇటీవల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేపట్టారు. ఇందుకోసం అంతర్గత రోడ్డును తవ్వారు. అయితే పనులు పూర్తయిన తర్వాత రోడ్డు వేయకుండానే వదిలేశారు. తవ్వేసిన దానిపైన కనీసం సన్నగ్రావెల్‌తోనైనా పూడ్చకుండా మట్టితో పూడ్చేసి సరిపెట్టుకున్నారు. దీంతో సోమవారం కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్డు కుంగిపోయింది. అంతేకాకుండా రోడ్డు అంతా బురదమయమైంది. దీంతో అస్తవ్యస్తంగా తయారైన రోడ్డుతో పాదచారులు నడిచేందుకు వీలు లేక నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. అంతేకాకుండా ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించే క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయి గాయాలపాలవుతున్నారు.



చిన్నపాటి వర్షానికే కుంగిపోయిన రోడ్డు

అధికారుల జాప్యం

భూగర్భ డ్రెయినేజీ పనులు పూర్తి కాగానే టెస్టింగ్ చేసి అంతా బాగుందని నిర్ధారించుకున్న వెంటనే సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. అయితే పనులు పూర్తయిన తర్వాత చేపట్టాల్సిన ట్రయల్ రన్ విషయంలో కాలయాపన చేస్తున్నారు. ఇలా ఎంత కాలమని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. త్వరితగతిన సిమెంట్ రోడ్డు వేస్తే రాకపోకలకు ఇబ్బందులు లేకుండా హాయిగా ప్రయాణం చేసేందుకు వీలుంటుందని స్థానికులు అంటున్నారు. లేకుంటే నిత్యం ప్రమాదాల బారిన పడి గాయాలపాలవడం జరుగుతోందని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ఈవిషయమై పబ్లిక్ హెల్త్ డీఈఈ జానకీరామ్‌ను ఫోన్‌లో సంప్రదించగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి కుంగిన రోడ్డును బాగు చేయిస్తామని సమాధానం ఇచ్చారు.



మారుతీనగర్‌లో భూగర్భ డ్రెయినేజీ పనుల తర్వాత అస్తవ్యస్తంగా మారిన రోడ్డు

నేత్రపర్వం.. వేంకటేశ్వరుని కల్యాణం



నెల్లూరు(బృందావనం) : శ్రవణా నక్షత్రం సందర్భంగా బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామికి తిరు కల్యాణ మహోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. తొలుత మందిరంలో కొలువైన స్వామివార్లకు ప్రధానార్చకుడు బృందావనం శ్రీనివాసదీక్షితులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, పూజలు జరిగాయి. సర్వాలంకారశోభితంగా కొలువైన స్వామివార్లను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించారు. ఉభయకర్తలుగా గుర్రం బ్రహ్మానందం దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కె.శివప్రసాద్, త్యాగరాజ కల్యాణ మండప అధ్యక్ష, కార్యదర్శులు అమరా మోహన్‌రావు, ఎస్.హనుమంతరావు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కనకమహల్ సెంటర్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు ఉద్యమానికి సుందరయ్య చేసిన సేవలను వారు కొనియాడారు. జిల్లాలోని అలగానిపాడు గ్రామంలో జన్మించిన ఆయన చదువుకునే రోజుల్లో వామపక్ష భావాలు కలిగి కమ్యూనిస్టు పార్టీలో చేరినట్లు తెలిపారు. ఆయన సొంత గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి అనేక మంది పేదలకు భూములను పంపిణీ చేశారన్నారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి, వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, నాయకులు నాగేశ్వరరావు, పెంచలనరసయ్య, మస్తాన్‌బీ, శివకుమారి పాల్గొన్నారు.

➡ పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. శ్రీనివాసులు, నాగేశ్వరరావు, అశోక్, సూర్యనారాయణ పాల్గొన్నారు.



సుందరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసులు

➡ బుజబుజ నెల్లూరు, పడారుపల్లి, శిరోమణి నగర్ ప్రాంతాల్లో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కొండా ప్రసాద్, నాయకులు సురేష్, సుబ్బారావు, మల్లికార్జున, సుధాకర్, వెంకటేశ్వర్లు, పెంచలనరసయ్య, మాలకొండయ్య, కృష్ణమూర్తి, వెంకయ్య, శ్రీనివాసులు, మనోజ్, పుల్లయ్య పాల్గొన్నారు

➡ వెంకటేశ్వరపురంలోని సీపీఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి గడ్డం శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్, మూలం ప్రసాద్ నివాళులర్పించారు.

పెద్దాస్పత్రిలో రక్తదాన శిబిరం

నెల్లూరు(అర్బన్) : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేంద్ర, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మస్తాన్‌బాషా మాట్లాడుతూ పేదలు ఎక్కువగా వచ్చే పెద్దాస్పత్రిలో రక్తనిల్వలు అడుగంటిపోయాయన్నారు. ఇలాంటి తరుణంలో రక్తదానం చేస్తున్న యూనియన్ నాయకులు, కార్యకర్తలను అభినందించారు. అడ్మినిస్ట్రేషన్ అధికారి కళారాణి, అసోసియేట్ ప్రొఫెసర్ గంగాధర్, డాక్టర్ సింధూజ, యూనియన్ గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్,



అధ్యక్ష, కార్యదర్శులు కమ్మటి శ్రీనివాసులు, సందాని బాషా, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్, కేసీ పెంచలయ్య, మనోజ్‌కుమార్, రామాంజులు, మోహన్‌రాజు, సామెల్, మాలకొండయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో చిన్నారి ప్రతిభ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఇటీవల కేరళలో జరిగిన జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ ర్యాంకింగ్ ఓపెన్ నేషనల్ చాంపియన్ షిప్‌లో జిల్లాకు చెందిన చిన్నాబత్తిన నందిని 12-15 సంవత్సరాల విభాగంలో ఎనిమిదో ర్యాంక్ సాధించిందని జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుధీర్‌కుమార్, కె.కామేష్‌లు సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో 1,500 మీటర్ల విభాగంలో బంగారు పతకం, వెయ్యి మీటర్ల విభాగంలో సిల్వర్, 500 మీటర్ల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలియజేశారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన నందినిని అభినందించారు.



హనుమజ్జయంతి ఉత్సవాలకు అంకురార్పణ

నెల్లూరు(బృందావనం) : రామ్‌నగర్ శబరి శ్రీరామక్షేత్రంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే హనుమజ్జయంతి ఉత్సవాలకు సోమవారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు స్వామివారు ప్రత్యేకాలంకారణలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఆర్.స్వాతి, ఆర్.శృతి, పుచ్చలపల్లి శ్రీరాములురెడ్డి, లీలావతి వ్యవహరించారు. ఉత్సవాల్లో భాగంగా గత శుక్రవారం సాయంత్రం నుంచి 72 గంటల పాటు సాగిన హనుమాన్‌చాలీసా అఖండ పారాయణం సోమవారం ముగిసింది.



దళిత విద్యార్థిపై దాడికి నిరసన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : తీవ్రంగా గాయపడి నెల్లూరు షైన్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న తిరుపతికి చెందిన దళిత విద్యార్థి జేమ్స్‌ను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డిలు సోమవారం పరామర్శించారు. అనంతరం నెల్లూరు వీఆర్సీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జేమ్స్‌పై దాడిని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. జేమ్స్‌పై దాడిని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ప్రజలకు ప్రభుత్వం భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ యుజవన విభాగం నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు ఉన్నారు.



నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగం నాయకులు

ఏడాదిలోనే ప్రభుత్వంపై వ్యతిరేకత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కిసాన్‌నగర్‌లో సోమవారం జరిగిన మూడో డివిజన్ ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మూడో డివిజన్ ఇన్‌చార్జిగా అక్కలరెడ్డి నారాయణరెడ్డిని ప్రకటించారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మోసపు హామీలు గుప్పించి టీడీపీ అధికారంలోకి వచ్చిందని, ప్రస్తుతం వాటిని అమలు చేయలేక చతికిలపడిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. పార్టీ కోసం శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు సముచిత ఉంటుందన్నారు. కార్పొరేటర్లు వేలూరు ఉమామహేష్, నీలి రాఘవరావు, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సిద్ధిక్, మాజీ ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, పార్టీ నేత రామసుబ్బారెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి, పలు డివిజన్ ఇన్‌చార్జిలు సంధాని, సుబ్బారెడ్డి, గిరిరెడ్డి, మహేష్ యాదవ్, స్థానిక నాయకులు అభిషేక్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, హరిబాబు, మల్లికార్జునరావు, యస్దాని, అలీమ్, రఘు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

రాంజీనగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు, 48వ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిక్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీల నుంచి ఆబిద్‌తో పాటు వంద కుటుంబాలు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని సోమవారం కలిసి వైఎస్సార్సీపీలో చేరారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్పొరేటర్ కరిముల్లా, పార్టీ నేతలు రఫీబాయ్, జిల్లా యాక్టివిస్ట్ సెక్రటరీ జహీద్, ఖజానా వెంకటశేషయ్య ఆచారి, బెల్లంకొండ వాణి, మునికృష్ణ, మున్నా, సాబిర్, రబ్బు, ఇంతియాజ్, నాయబ్, అస్లాం పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో మరే ఇతర కారణమో తెలియదుగానీ గుర్తుతెలియని వ్యక్తి పొదలకూరు రోడ్డు ఎస్పీ బంగ్లా సమీపంలో ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడు సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉన్నాడు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94407 00018, 94403 33191కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



మృతుడు

ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు

నెల్లూరు(టౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. కావలి విశ్వోదయ హైస్కూల్లో జరిగిన పది పరీక్షకు ఒక అభ్యాసకుడు హాజరయ్యారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరిగింది. ఇంటర్ పరీక్షలకు 160 మందికి గానూ 106 మంది అభ్యాసకులు హాజరయ్యారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

నెల్లూరు(బారకాసు) : ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు సంబంధించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తెలిపారు. ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆయన సోమవారం నిర్వహించారు. తొలుత ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందుకున్న అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలని సూచించారు. పీజీఆర్ఎస్ ద్వారా మొత్తం 58 ఫిర్యాదులను అందుకున్నట్లు వెల్లడించారు. విభాగాల వారీగా టిడ్కో విభాగానికి -20, అప్కాస్‌కు- 4, ఇంజినీరింగ్-7, టౌన్‌ప్లానింగ్-11, రెవెన్యూ- 8, పెన్షన్-2, అకౌంట్స్- 4, పబ్లిక్ హెల్త్- 2 చొప్పున అర్జీలు వచ్చాయన్నారు. సిటీ ప్లానర్ హిమబిందు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు, మేనేజర్ రాజేశ్వరి, పలు విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ చెన్నుడు

సవరణలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలో జరిపే రీసర్వే ద్వారా ఆస్థి పన్నుల సవరణలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కమిషనర్ నందన్ రెవెన్యూ అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 17వ డివిజన్ చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని కొన్ని భవనాలకు కొలతలు వేయించి అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో డ్రెయిన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు క్రమం తప్పకుండా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనధికార నిర్మాణాలను తప్పనిసరిగా కూల్చివేస్తామన్నారు. కాలువలను ఆక్రమిస్తూ చేపట్టిన ర్యాంపులు, మెట్ల నిర్మాణాలను తొలగించి అవసరమైన చోట సిల్ట్ తొలగింపు పనులను చేపట్టాలని కమిషనర్ తెలిపారు.



17వ డివిజన్‌లో రోడ్డు వెడల్పును కొలతలు తీయిస్తున్న కమిషనర్ నందన్

వర్షంలోనూ సీహెచ్‌ఓల నిరసన

నెల్లూరు(అర్బన్): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీహెచ్‌ఓలు నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద చేస్తున్న నిరసన దీక్షలు 22వ రోజుకు చేరాయి. సోమవారం జోరు వర్షంలోనూ టెంట్ కింద నుంచి కదలకుండా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓల అసోసియేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్కె ఆదిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 8 వేల మందికిపైగా సీహెచ్‌ఓలున్నారని, వీరిలో 7,500 మంది వరకు మహిళా ఉద్యోగులే ఉన్నారన్నారు. మహిళలకు అన్యాయం జరగనివ్వమంటున్న ప్రభుత్వం తమ సమస్యల గురించి చర్చించమంటే మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కొంత మంది అధికారులు ప్రభుత్వం వద్ద మెప్పు పొందేందుకు తమపై బురద జల్లుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా తమ ప్రధాన సమస్యలైన వేతనాలను నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం పెంచాలన్నారు. ప్రావిడెంట్ ఫండ్ పునరుద్ధరించాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, జాబ్ వర్క్ చార్ట్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, కార్యదర్శి రుబికా, ప్రియాంక, రోజ్‌మేరి, చంద్రకళ తదితరలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం

నెల్లూరు(బృందావనం) : కొండాయపాళెం రోడ్డు రామకృష్ణ నగర్‌లోని విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో మహాకుంభాభిషేక మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకు పూజలు, హోమాలు, పారాయణం, మహాపూర్ణాహుతితో పాటు మహాకుంభాభిషేకం తదితర పూజాది కార్యక్రమాలను బండాత్మకూరు భానుప్రకాష్‌శర్మ, తంగిరాల వరప్రసాద్ శర్మ, పులిజాల సురేష్‌శర్మ ఆధ్వర్యంలో గావించారు. సాయంత్రం శాంతి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం స్వామివారి నగరోత్సవం వేడుకగా సాగింది. ఆయా కార్యక్రమాలను చిన్ని వెంకటేశ్వర్లు, పోలవరపు హనుమంతరావు సౌజన్యంతో నిర్వహించినట్లు దేవస్థానం మేనేజింగ్ ట్రస్టీ కోట ప్రభాకర్‌రావు తెలిపారు.

